తెలుగు సాహితీవేత్తలకు, అభిమానులకు నమస్కారం!

తెలుగు సాహితీ వనంలో కథకు ఓ ప్రత్యేకమైన స్థానం ఉంది. తెలుగు కథ పుట్టి వందేళ్ళు పైనే అయిందని మనం గర్వంగా చెప్పుకుంటాం. అసలు మన ఇతిహాసాల్లోనే పిట్ట కథలు ఉన్నాయనే విషయాన్ని కూడా మనం చెప్పుకోవచ్చు. అంత వెనుకకు మనం వెళ్లలేకపోయినా సరే, ఆధునిక తెలుగు కథకి స్వర్ణయుగం 1900 - 2000 అని చరిత్రకారులు చెపుతున్నారు. నిజమే! ఎక్కువమంది పాఠకులు కథల మీద మక్కువ చూపించిన కాలం అది. కథా రచయితనీ, పాఠకుడినీ దగ్గిరకి చేర్చే ప్రక్రియలో అనేక దిన, వార, పక్ష, మాసపత్రికలు ఉండేవి. ఇవి కాకుండా, రోజుకి కనీసం ఒక కథా సంపుటం విపణిలోకి అడుగుపెట్టేది. ప్రతీ ఇంటిలో ఓ చిన్న లైబ్రరీ ఉండేది. పత్రికల్లో వచ్చే కథలను, సీరియల్స్ ని జాగ్రత్తగా కత్తిరించి, పుస్తకరూపంలో తయారు చేసుకునే "కుటుంబ పరిశ్రమ" కూడా ఆనాటి తెలుగువారి సొత్తే!! కథలు రాయాలనే ఆలోచనలు... బాల్యంలోనే మొగ్గలు తొడిగేలా మెదడుని సారవంతం చేసే విద్యా విధానాలు ఉన్న కాలం కూడా అదే.

సరే.. అలాంటి కథాకాలంతో పాటు చాలా సాంప్రదాయాలు, అలవాట్లు, ఆలోచనలు కంచికి వెళ్ళిపోయాయి. సాధారణ జీవనం యాంత్రికమై పోయింది. "గడిచినకాలం కదా స్వర్ణయుగం" అని షష్టిపూర్తి అయినవారు అనుకుంటే, "ఏం.. ఇది కాదా!" అని యువతరం కూడా ప్రశ్నిస్తున్న యుగం ఇది.

ఈ నేపథ్యంలో ఒక్కసారి వాస్తవ పరిస్థితులను గమనిస్తే.. వచ్చేవి మిశ్రమ ఫలితాలే. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో మనకు కనిపించేది, అనిపించేది.. "కొంచెం లాభం, కొంచెం నష్టం". అలా మారిన పరిస్థితుల్లో తెలుగుకథకి కొరత రాలేదు గాని, కొంత మబ్బు చాటున ఉందనే విషయాన్ని ఒప్పుకోవాలి. కర్ణుడి చావుకి కారణాలు ఎన్ని ఉన్నాయో.. తెలుగుకథ మబ్బుచాటున తలదాచుకోడానికి కూడా అన్ని కారణాలున్నాయి. అందులో.. “చదువరులు లేనందువల్ల పత్రికల మనుగడ సాగటం లేదు” అనేవారు కొందరైతే, “అసలు మంచి కథే రావడం లేదు” అనే వాదనతో మరికొందరు, 'అబ్బే, చదవడానికి ఈ తరం వాళ్లకి టైము లేదు, ఉత్సాహం లేదు, వీటికి తోడు టివి, అంతర్జాల వలల్లో కొట్టుమిట్టాడుతున్న వీళ్ళల్లో పుస్తక పఠనం పడిపోయింది” అని వాపోతున్నవారు కొందరు.

శరవేగంగా మారిన పరిస్థితుల్లో, ఈ కోణాలను పరిశీలిస్తే... కనబడేవి మళ్ళీ మిశ్రమ ఫలితాలే. "అదేంవిటి సార్.. గోడమీద పిల్లి వ్యవహారం" అంటూ ఎవరికైనా మా ఈ అభిప్రాయం మీద అనుమానం రావచ్చు. కాని మా అభిప్రాయం మాత్రం ఇదే. పత్రికల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందనేది నిజం. అందువల్ల పాఠకుల ఆర్తి తీరేదెలా. ఇక ఉన్న ఒకే ఒక దారి అంతర్జాలం లోని కథా కమామీషులు. ఇక్కడ వచ్చిన చిక్కల్లా ఈ రచనలు ఎక్కువ శాతం రచయితల పేర్లు లేకుండా ఉంటాయి. అందుకని ఏమైనా రాయచ్చు, అడ్డు అదుపూ ఉండదు. ఇది పెరగడం ఎవ్వరికీ మంచిది కాదు. కానీ తెలుగు రచన చదివే సరదాలో, తపనలో చాలా మంది ఈ రచనలకి దగ్గిర అవుతున్నారు.

ఇంకా, "మన తెలుగుభాష మరుగున పడుతోంది కదా.. ఇంకా ఈ కథలు నవలలు చదివేవారు, రాసేవారు ఎవరున్నారు సార్! మీ చాదస్తం గానీ.." అని దీర్ఘాలు తీసేవారున్నారు, భాష మరుగున పడలేదు. అనేక రంగాల్లో, అంతర్జాతీయ స్థాయిల్లో తెలుగు వర్ధిల్లుతోంది. ఇంకా వర్ధిల్లుతుంది. భారత దేశం లో తెలుగు మాట్లాడే వాళ్ళు నాలుగో స్థానం లో ఉన్నారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలలో తెలుగు వాడుక గణనీయంగా పెరిగింది. గత ఏడు సంవత్సరాలలో అక్కడ తెలుగు వాడుక 86 శాతం పెరిగింది. ఇక రాసేవారు, చదువరులు వేల సంఖ్యలో పెరుగుతున్నారు. వారికోసం, వారిని సంధానం చెయ్యడం కోసం ఓ ప్రయత్నం చేస్తున్నాం. ఒక చిన్న పత్రిక తో ఈ కార్యక్రమానికి ఉడుతా సాయం చేద్దామని ముందుకు వచ్చాం. మీ చేయూత ఇవ్వండి!

కథ మనిషి గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తుని కూడా చూపెడుతుంది. మనిషి ఉనికిని చాటుతుంది. మనిషి మనుగడను బలోపేతం చేస్తుంది! ఇది వందల సంవత్సరాల కిందట మాటే కాదు.. నేడూ, రేపూ నిలిచే సత్యం కూడా!"

ఈ కోవలోనే ఆలోచించి..

**"కథా మంజరి"** పేరుతో ఒక ఈ-మెయిల్ పత్రిక ఆరంభిస్తున్నాం. రంచనుగా ప్రతీ నెల ఒకటో తారీఖు నాటికి, ఈ పత్రిక కావాలనే వారికి, వారి ఈ-మెయిల్ చిరునామాకి చేరుతుంది. ఇది పిడియఫ్ రూపంలో ఉండి, మీకు చదువుకోడానికి వీలుగా ఉంటుంది. ఈ పత్రిక పొందడానికి ఎలాంటి రుసుమూ లేదు, మీకు ఈ-మెయిల్ అడ్రసుండి, అది మాకు తెలియచేస్తే చాలు, మీ అభ్యర్థన మేరకు మీకు చేరుతుంది.

ప్రతీ నెలా వచ్చే ఈ పత్రికలో పది కథలు మాత్రమే ఉంటాయి. అందులో మూడు కథలను న్యాయనిర్ణేతలు ఉత్తమ కథలుగా ఎన్నిక చేస్తారు. ప్రచురితమయ్యే కథల్లో యువ రచయితలకి ప్రాధాన్యత ఉంటుంది. యువ రచయితలని ప్రోత్సహించడమే ఇక్కడ ఉద్దేశ్యం. అలాగే, రెండు తరాల వారి రచనలకు ఇదో వారధిగా ఉండటమే కాకుండా, వారు వీరు పాఠకులను కలిసి రంజింపచేస్తారనే ఆశ.

**కథా మంజరి ...**

- పత్రిక ప్రతి నెలా ఒకటవ తారీఖున మీరు నమోదు చేసుకున్న ఈ-మెయిల్ కి వస్తుంది.
- ప్రతి పత్రిక లోనూ పది కథలు మాత్రమే ఉంటాయి.
- కథా రచయితలు పంపించిన రచనలను ఎంపిక కోసం న్యాయ నిర్ణేతలకు పంపించడం జరుగుతుంది.
- ప్రతి నెలా పదిహేనవ తారీఖు లేదా అంతకు ముందు అందుకున్న రచనలను మాత్రమే పరిశీలనకు పంపించడం జరుగుతుంది. పదిహేనవ తారీఖు తరువాత వచ్చే రచనలను, ఆ తర్వాత నెల పరిశీలనకు పంపడం జరుగుతుంది. ప్రచురణకు అర్హత లేని కథల విషయంలో ఆయా రచయితలకు సముచితం గా ఈ-మెయిల్ ద్వారా తెలియచేయబడుతుంది.
- రచనలను అందుకున్న 3 రోజుల లోపుగా మా నించి నిర్ధారణ రచయితలకు పంపబడుతుంది. ఎవరికైనా ఆ నిర్ధారణ రాక పోతే దయచేసి మాకు తెలియచెయ్యండి. దానికి మీరు వాడవలసిన ఈ-మెయిల్ info@kathamanjari.in
- రచనల రాక, పోక ఈ-మెయిల్ ద్వారా మాత్రమే.
- ఒక నెల సమయంలో మాకు వచ్చిన రచనలలో పది రచనలు ప్రచురణకి ఎంపిక చేయబడతాయి. ప్రతీ నెలా, వీటిలో మూడు రచనలను ఉత్తమ రచనలు గా న్యాయనిర్ణేతలు ఎంపిక చేస్తారు.
- ఈ మొత్తం కార్యకలాపాలలో పత్రికదే తుది నిర్ణయం.

మీరు పంపబోయే రచనలకు సంబంధించి కొంచెం సూక్తి ముక్తావళి.

- ✓ మీ రచన దేనికీ అనువాదం కానీ, అనుసరణ గాని కాకూడదు. ఇది పూర్తిగా మీ స్వంత రచనే అవ్వాలి.
- ✓ ఈ రచన ఇంతకు ముందెన్నడూ, ఎక్కడా ప్రచురితం అయినది కాకూడదు.
- ✓ ఈ పత్రికలో ప్రచురణ అయిన కథలు, ఆ తరువాత ఆయా రచయితలు ఇతర పత్రికలకు ప్రచురణ నిమిత్తం పంపుకోవచ్చును. మాకు ఏవిధమైన అభ్యంతరం లేదు.
- ✓ అసభ్యకరమైన, సామాజిక వ్యతిరేకమైన ఆలోచన, పద ప్రయోగం పూర్తిగా నిషిద్ధం.
- ✓ రచయిత వయసుని సూచించడం మర్చిపోవద్దు.
- ✓ రచయిత పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, ఇ-మెయిల్ ఎడ్రసు, హామీపత్రం, వయస్సు వగైరా వివరాలను మొదటి పేజీలోనే పొందుపరిచి, రెండో పేజీ నుంచి కథని రాయాలి.
- ✓ రచనల డాక్యుమెంట్ వివరాలు: Gautami font, size 14, line spacing 1.5, no header and footer, maximum size 800 words.

ఈ సాహితీ ప్రక్రియ లో మీ సహకారం సదా ఆశిస్తూ,

జయంతి ప్రకాశ శర్మ<br>సంపాదకుడు

అవసరాల వెంకటరావు<br>ప్రచురణ కర్త



## కథా మంజరికి మూడు ముఖ్యమైన చిరునామాలు

- ❖ కొత్తగా "కథా మంజరి"కి పరిచయం అవ్వాలంటే – www.kathamanjari.in
- ❖ మీ కథను పంపించాలంటే – submit@kathamanjari.in
- ❖ వేరే విషయం ఏదైనా – info@kathamanjari.in